క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ పీవీజీ తిలక్

గోపాలపురం: బ్యాంకుల్లో జరిగే సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని చిట్యాల ఎస్‌బీఐ బ్యాంకు వద్ద సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల దోపిడీదారులు అనేక కొత్తదారులు వెతుకుతున్నారని అందులో సైబర్ నేరాలతో పాటు ఫిసింగ్‌కాల్స్, కలర్‌ఐడీ స్కాం, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ లావాదేవీలలో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరం జరిగిన వెంటనే సంబంధిత బ్యాంకుఅధికారులకు సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు.

నిడదవోలు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ సూచించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం బ్యాంక్ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును, వాటిని నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. పట్టణ ఎస్సై శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

చాగల్లు: కలవలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అండర్-14 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో తృతీయ స్థానం సాధించినట్టు ప్రధానోపాధ్యాయులు జె.వెంకట శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11 తేదీ వరకు విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించిందని తెలిపారు. జిల్లా జట్టులో కలవలపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు పంతకాని లాస్య, కానుబోయిన తేజ, తాడేపల్లి వెన్నెల పాల్గొని చక్కటి ప్రతిభ చూపారన్నారు. వీరికి కోచింగ్ ఇచ్చిన పీడీ గంగాధరరావు, విద్యార్థినులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత


ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఓ సక్సేనా రాజు

ఉండ్రాజవరం: ప్రజలందరూ భాగస్వామ్యంతో మనుషుల అక్రమ రవాణా నిర్మూలనను సమూలంగా నివారించవచ్చునని ఎంఈఓ కె.సక్సేనా రాజు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మాణిక్యాలరావు, ప్రజ్వల ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఎంఈవో రాజు, ప్రజ్వల ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ఏవిధంగా నివారించవచ్చో వివరించారు. ప్రజ్వల సంస్థ గత 28 సంవత్సరాల నుంచి 28,700 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించిందని తెలిపారు. ప్రజ్వల కోఆర్డినేటర్ గ్రావ్య, సిబ్బంది, టీచర్స్ పాల్గొన్నారు.

యువకుల మృతి దురదృష్టకరం


తాడిపర్రులో బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న నాయకులు

ఉండ్రాజవరం: విద్యుదాఘాతంతో యువకులు మృతి చెందడం దురదృష్టకరమని మండలంలోని గౌడ, శెట్టి బలిజ సంఘం నాయకులు అన్నారు. తాడిపర్రు గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన నలుగురి యువకుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున రూ.లక్షతోపాటు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావుకు రూ.18,500 ఆర్థిక సహాయాన్ని సోమవారం వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో చివటం ఎంపీటీసీ వేముల వెంకట సత్యనారాయణ, వీరమల్లు ఫణీంద్ర కుమార్, వీరమల్లు బాలాజీ, మట్టా శ్రీనివాసు, చిటికెన వంశీ ప్రసాద్, నార్గాని వెంకట్రావు, తాటిపాక గ్రామ గౌడ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కొవ్వూరు: స్థానిక గ్రంథాయలంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహి ంచారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో వంద మంది ఈ పోటీలు పాల్గొన్నారు. సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనం శ్రీనివాస మూర్తి, కవి, పుస్తక రచయిత అనిపెద్ది జగన్నాథ శాస్త్రీ, రిటైర్డు లెక్చరర్ రాయప్రోలు కామేశ్వర శర్మ, రిటైర్డు తెలుగు పండిట్ చామర్తి విశ్వనాథం, యువ కవి ఎం.రాజు, గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి జీవీవీఎస్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చినకాశిరేవులో అన్నీ సమస్యలే..

- అధ్వానంగా కాలువ రేవులు
- వెలగని వీధి దీపాలు
- ప్రమాదకర పరిస్థితిలో గంగ స్నానాలు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు


పట్టణంలోని చినకాశిరేవు

నిడదవోలు: పట్టణంలోని చినకాశీరేవులో కాలువ రేవులు సమస్యలమయంగా మారాయి. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. కాలువ రేవుల నిర్వహణను మున్సిపల్ అధికారులు గాలికొదిలేయడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కార్తికమాసంలో గంగ స్నానాలు చేసేందుకు వచ్చిన భక్తులు నానా అవస్థలు పడుతున్నారు.

ఆధ్యాత్మికతలకు నిలయం

దక్షిణ కాశీగా పేరుగాంచిన చినకాశి రేవులో సుమారు 30 వరకు వివిధ దేవతమూర్తుల ఆలయాలు ఉన్నాయి. నిత్యం ఇక్కడ పూజా కార్యక్రమాలు, సత్యనారాయణ వ్రతాలు, ఆలయాల్లో కల్యాణ మహోత్సవాలు, కార్తికమాసం, శివరాత్రి పర్వదినాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాల దీక్ష దారులకు ఉచితంగా బిక్ష అందిస్తారు. సుమారు ఇక్కడ 200 మంది అయ్యప్ప స్వాములు పూజ కార్యక్రమాలు చేస్తున్నారు. వీరంతా నిత్యం కాలువ రేవుల్లో స్నానాలు చేస్తారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో వందలాది వివాహాలు జరుగుతాయి. రానున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు కూడా ఇక్కడే నిర్వహిస్తారు. మూడు రోజులపాటు ఇక్కడ తీర్థం జరుగుతుంది. ఇంతటి ప్రధానమైన చినకాశి రేవుకు రావాలంటే భక్తులు భయపడుతున్నారు. రైల్వే ట్రాక్ దాటుకుని వెళ్లాలి. నిత్యం 200 పైగా రైళ్ల రాకపోకలు సాగించే ట్రాక్ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆలయాలకు వచ్చే భక్తులు తప్పనిసరిగా రైలు పట్టాలు దాటి రావాల్సిందే. ఈ సమయంలో ఏ ప్రమాదం ముంచుకోస్తోందోనని ప్రజలు భయాందోళన చేందుతున్నారు. నిడదవోలు ప్రధాన కాలువపై బ్రిటీష్ హయాంలో నిర్మించిన వంతెన కూలిపోవడంతో రాకపోకలకు మరీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇవీ సమస్యలు

- పశ్చిమడెల్టా ప్రధాన కాలువ ఒడ్డున పలు దేవతామూర్తుల ఆలయాలు కొలువుదీరడంతో చినకాశిరేవు ఆధ్యాత్మికతకు, దక్షిణ కాశీగా పేరుగాంచింది. ఇక్కడ రేవులు ఉండడంతో భక్తులు ఎక్కువగా స్నానమాచరించేందుకు వస్తుంటారు. కార్తికమాసం కావడంతో తెల్లవారు జామునే అధిక సంఖ్యలో మహిళలు స్నానాలు చేసేందుకు వస్తున్నారు. ఇక్కడ సదుపాయాల్లేక సతమతమవుతున్నారు.
- ఇక్కడ ఉన్న నాలుగు విధి దీపాలలో రెండు వెలగడం లేదు. స్నానాలు చేసే కాలువ రేవు మెట్ల వద్ద రెండు దీపాలు వెలగకపోవడంతో వేకువజామున వస్తున్న మహిళలు చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- పశ్చిమడెల్టా ప్రధాన కావుల ద్వారా నీటి విడుదలను తగ్గించే సమయంలో నీరు కింద వరకు వెళుతోంది. అప్పుడు రేవుల్లో మెట్ల వద్ద మట్టి పేరుకుపోతోంది. దీంతో స్నానాలు చేయడానికి భక్తులు ఇబ్బంది పడుతున్నారు.
- రేవుల్లో మెట్లను శుభ్రం చేయకపోవడంతో నాచు పట్టి కాలు జారి ప్రమాదాలకు గురవుతున్నారు.
- రేవుల్లో ఉన్న మూడు చేతిపంపుల్లో ఒకటి మాత్రమే పనిచేస్తుంది. దీంతో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు.
- ఇక్కడ ఉన్న ఆరు కాలువ రేవుల్లో అయ్యప్ప స్వామిగుడి ముందు ఉన్న రేవు మరీ అధ్వానంగా మారింది. పిండాలు పెట్టేవారు, పూజ తర్వాత వాడిన పూలు, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతోంది. నిత్యం ఇక్కడ చెత్తాచెదారాలు ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మిగిలిన రేవుల్లో కూడా చెత్త పేరుకుపోయి మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి.
- మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఉదయం మాత్రమే వచ్చి తూతూ మంత్రంగా పనులు చేసి వెళ్లిపోతున్నారని భక్తుల ఆరోపిస్తున్నారు. నిత్యం వందలాది మంది ఇక్కడ గంగ స్నానాలు చేస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రేవులో పారిశుధ్య మెరుగుకు అవసరమైన చర్యలు పురపాలక సంఘ అధికారులు తీసుకోలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

స్నానాలకు ఇబ్బంది



కాలువ రేవులు అధ్వానంగా ఉన్నాయి. అయ్యప్ప ఆలయంలో నిత్యం పూజలు జరుగుతున్నాయి. ఉదయం సాయంత్రం రేవులో స్నానాలు చేస్తున్నాం. రేవులు మట్టి, మలినాలతో అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ పారిశుధ్యం అంత బాగోలేదు. అధికారులు చర్యలు తీసుకుని రేవులను శుభ్రం చేయాలి.
– నందివాడ సత్యనారాయణ, అయ్యప్ప స్వామి భక్తుడు

లైట్లు లేకపోవడంతో..



కార్తికమాసం కావడంతో తెల్లవారుజామున భక్తులు గంగ స్నానాలు చేయడానికి వస్తున్నారు. ఇక్కడ ఉన్న నాలుగు వీధిలైట్లలో రెండు లైట్లు వెలగడం లేదు. దీంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. రైలు పట్టాలు దాటి రావడానికి భయపడుతున్నారు. చినకాశిరేవులో సౌకర్యాలు కల్పించాలి.
– సాయి, అర్చకులు, నిడదవోలు


చినకాశి రేవులో పేరుకుపోయిన మట్టి


చినకాశి రేవులో మొలకెత్తిన పచ్చగడ్డి


చినకాశి రేవులో అయ్యప్ప ఆలయం ముందు రేవులో పేరుకుపోయిన చెత్తాచెదారాలు

ఎస్సీ వర్గీకరణ క్రీమీలేయర్‌ను తక్షణమే విరమించుకోవాలి

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు కాంతారావు


వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు కాంతారావు

నల్లజర్ల: ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట ప్రభుత్వాలకు లేదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు పిల్లి కాంతారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన నల్లజర్లలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ క్రీమీలేయర్ ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో రాజ్యాంగ బద్ధంగా ఆర్టికల్ 338 ద్వారా నిర్మించిన జాతీయ ఎస్సీ కమిషన్లు ఉన్నాయని వాటిని కాదని ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం అవిశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ మిశ్రా వన్‌మేన్ కమిషన్ వేయడమే కాకుండా కమిషన్ రిపోర్టు ఇవ్వకుండానే కేవలం కమిషన్‌కు రెండు నెలలు గడువు పెట్టడం, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాలు ముందుగానే తెలియజేయం క్షమించరాని దుర్మార్గమన్నారు. రాజీవ్ మిశ్రా కమిషనస్ రాష్ట్ర వ్యాప్తంగా మాలలు అడ్డుకోవాలన్నారు. ప్రజలపై ఈ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ఎన్నికల హామీలు అమలు చేయాలని, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణపై కుట్రలు మానుకోవాలన్నారు. వర్గీకరణపై కుటిల రాజకీయాలు మానుకోవాలని సూచించారు.

ఆస్తి పంపకంలో మోసం చేసిన వ్యక్తి ఆరేళ్లు జైలు

- రూ.6వేల జరిమానా విధిస్తూ తీర్పు
- ఆస్తి కోసం బాలుడిని చంపుతానని సంతకాలు పెట్టించుకున్న వైనం
- నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు

కొవ్వూరు: ఆస్తి పంపకం విషయంలో చంపుతానని బెదిరించి వంద రూపాయిల స్టాంపుపై బలవంతంగా సంతకం చేయించుకున్నట్టు వచ్చిన ఆరోపణ రుజువు కావడంతో అడ్డాల వెంకట కృష్ణమోహన్ అనే వ్యక్తికి ఆరేళ్ల జైలు శిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సత్యవతి తీర్పు నిచ్చారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన అడ్డాల సుప్రియ అనే మహిళ తన భర్త అన్న అయిన కృష్ణమోహన్ ఆస్తి పంపకం విషయంలో అన్యాయం చేసినట్టు తాళ్లపూడి పోలీసులను ఆశ్రయించింది. తన నాలుగేళ్ల కుమారుడిన్ని గదిలో బంధించి కృష్ణమోహన్‌ను తమను బ్లాక్ మెయిల్ చేశారని పేర్కొంది. తనకు ఆస్తి రాసి ఇచ్చినట్లు వంద రుపాయిల స్టాంపుపై సుప్రియతో పాటు ఆమె భర్త శ్రీహరి, అత్త సత్యవతితో సంతకాలు చేసి ఇవ్వాలని లేకపోతే నాలుగేళ్ల బాలుడ్ని పీకపై కత్తి పెట్టి చంపుతామని బెదిరించారు.

ఈ మేరకు అప్పట్లో సుప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి తాళ్లపూడి ఎస్సై కె.అశోక్‌కుమార్ వివిధ సెక్షన్ల కృష్ణమోహన్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం నిందుతుడిపై నేరం రుజువు కావడంతో న్యాయ మూర్తి కృష్ణమోహన్‌కి ఆరేళ్ల జైలుతో పాటు రూ.6వేలు జరిమానా విధించినట్లు అడిషనల్ ప్రాసిక్యూటర్ కాకులపాటి వెంకట రమణ తెలిపారు. ఈ కేసు ప్రాసిక్యూషన్ తరుపున వెంకటరమణ వాదించారు.

చంద్రబాబు పాలనలో అంతా దాచుకోవడమే..

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- పార్టీ నాయకులతో సమావేశం


పోచవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: చంద్రబాబు పాలనా అంతా దాచుకో దోచుకో అన్న సిద్ధాంతంతోనే సాగుతుందని మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. పోచవరంలో సోమవారం వైఎస్సార్ సీపీ మండల స్థాయి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో పార్టీ నాయకుల నుంచి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఇటీవల అధికార పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఆయన ఖండించారు. అలాంటి వారికి పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పలువురు పార్టీ నాయకులు తమ అభిప్రాయాలను తెలియ జేశారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ చంద్రబాబు మాటపై నిలబడే వ్యక్తి కాదని ఆయన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. పథకాలు అమలు చేయకుండా లడ్డూ వివాదం, నేడు సోషల్ మీడియాపై ఇలాంటివ సృష్టిస్తున్నారే తప్ప పథకాలు అమలు చేయడంలేదన్నారు. అప్పుడే గతంలో మాదిరిగానే ఇసుక, మద్యంతో దోపిడీకి తెరలేపారని తెలిపారు. తాను నియోజక వర్గంలో ఏవ్వరికి ఏ ఇబ్బంది వచ్చినా పార్టీ తరపున అండగా ఉంటానని తెలిపారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీదే అధికారం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వర రావు, మాజీ కన్వీనర్ కుంటముక్కల కేశవనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిల్లా శ్రీనివాస్, మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి పరశురామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభొట్టి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, నాయకులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


కొవ్వూరు గామన్ ఇండియా టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్న గంజాయి మూటలు, లారీ

కొవ్వూరు: ట్రాలీ లారీలో అక్రమంగా తరలిస్తున్న 287 కిలోల గంజాయిని పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు కొవ్వూరులో గామన్ ఇండియా టోల్ ప్లాజా వద్ద లారీని తనిఖీ చేయగా గంజాయి పట్టుకున్నట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. దీంతో మధ్యప్రదేశ్‌లో సిద్ధి జిల్లా నక్‌జహార్ కుడ్ గ్రామానికి చెందిన సాగర్ సాకేత్, సింగరోలీ జిల్లా చిత్రంగి గ్రామానికి చెందిన లాల్ బహుదూర్ సాకేత్‌లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన గంజాయితో పాటు లారీని స్టేషన్‌కి తరలించామన్నారు. యర్రంవరం వద్ద టోల్‌గేట్ సమీపంలో గంజాయిని లోడ్ చేసుకుని మధ్యప్రదేశ్‌లో అహ్మద్ నగర్ తరలిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి


రామన్నపాలెంలో భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జేడీ నాగమణి, దాతలు కిరణ్ దంపతులు

దేవరపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని పాఠశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఉపాధ్యాయులకు సూచించారు. దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో దాతలు నెక్కలపూడి పవన్ కుమార్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు అంజియ్య, ఉషమ్మ దంపతులు రూ.6.50 లక్షల వ్యయంతో నిర్మించిన యోగా, స్పోర్ట్స్, మల్టిపర్పస్ భవనాన్ని సోమవారం ఆర్‌జేడీ నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడలు దోహదపడతాయని ఆమె అన్నారు. నెక్కలపూడి కిరణ్ కటుంబ సభ్యులు రూ.6.50 లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించడం అభినందనీయమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్, ఎంఈఓ ఎం.తిరుమలదాస్, సర్పంచ్ కూచిపూడి బుల్లారావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

తూగో జిల్లా, దేవరపల్లి మండలం, దేవరపల్లి గ్రామానికి చెందిన కూచిపూడి వెంకట సాయి పవన్ S/O వెంకట శ్రీకృష్ణ అను నాకు చెందిన ఒరిజినల్ Passport No.Z3002897 జిరాక్స్ సెంటర్ కి ఆధార్ లో డేట్ ఆఫ్ బర్త్ అప్డేట్ కొరకు వేయుచుండగా పోయినది కావున దొరికిన వారు అందజేయగోరుచున్నాను.

ఇట్లు, కూచిపూడి వెంకట సాయి పవన్, సెల్ : 94403 72763

పరమశివా.. పాహిమాం..

- గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు
- కిటకిటలాడిన శివాలయాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు


బ్రాహ్మణగూడెంలో సుందరంగా అలంకరించిన బాలరామలింగేశ్వరస్వామి


కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం


కొవ్వూరు గోష్పాదక్షేత్రం స్నానఘట్టంలో శివలింగానికి దీపారాధన చేస్తున్న భక్తులు

కొవ్వూరు: గోష్పాదక్షేత్రంలో భక్తజనం పోటెత్తారు. కార్తిక సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను వెలిగించారు. స్నానఘట్టంలో ఉన్న శివలింగానికి గోదావరి జలాలతో భక్తులు అభిషేకాలు చేశారు. పట్టణంలో సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పా దేశ్వస్వామి ఆలయం, పంచాయతన శివాలయం, పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: మండలంలోని అన్ని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కాటకోటేశ్వరంలో ప్రసిద్ధి చెందిన ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సమిశ్రగూడెంలోని శ్రీపర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామి, తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేసి, దీపాలను వెలిగించారు.

పెరవలి: మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్నవరప్పాడు ఉమా విశ్వేశ్వరస్వామి ఆలయంలోను, మల్లేశ్వరంలో స్వయంభువుగా వేంచేసిన కపిల మల్లేశ్వర స్వామి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఖండవల్లిలో మార్కండేయ మృఖండేయ స్వామి ఆలయంలోను, ముక్కామలలో ఉమాసోమేశ్వరస్వామి తదితర ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు.

వైభవంగా అఖండ దీపోత్సవం

నిడదవోలు: పట్టణంలో గోలింగేశ్వరస్వామివారి ఆలయంలో లక్ష దీపోత్సవం, లక్ష కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దిపోత్సవంలో దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో నామా సూర్యప్రకాష్, అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

చాగల్లు: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి శివాలయాలు భక్తులతో పోట్టెత్తాయి. చాగల్లు రాజరాజేశ్వరి స్వామి ఆలయం, చిక్కాల, కలవలపల్లి, ఊనగట్ల, మార్కొండపాడు ఉమామార్కండేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం బాల రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు, పురజనులు ఆధ్వర్యంలో స్వామి వారికి సోమవారం సాయంత్రం అభిషేకాలు చేశారు. పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయల్లో దీపారాధన చేశారు.


నిడదవోలులో శివలింగం ఆకారంలో వెలిగించిన దీపాలు


నిడదవోలులో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


మల్లేశ్వరంలో విశేష అలంకరణలో కపిల మల్లేశ్వరస్వామి



